వరల్డ్‌కప్ 2023

నేటి మ్యాచ్‌లు

బంగ్లాదేశ్ X అఫ్గానిస్థాన్ | ఉ. 10.30 నుంచి | వేదిక: ధర్మశాల

దక్షిణాఫ్రికా X శ్రీలంక | మ. 2.00 నుంచి | వేదిక: ఢిల్లీ

జయహో భారత్

పురుషుల హాకీలో పసిడి ● బ్యాడ్మింటన్‌లో ప్రణయ్‌కు కాంస్యం

ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత అథెట్లు దుమ్మురేపుతున్నారు. సెంచరీ కొట్టడమే లక్ష్యంగా చైనాలో అడుగుపెట్టిన భారత బృందం.. ఇప్పుడా సంఖ్యను అవలీలగా దాటేసింది. ఇప్పటికే మనవాళ్లు 95 మెడల్స్ ఖాతాలో వేసుకోగా.. మరిన్నీ క్రీడాంశాల్లో పతకాలు ఖాయమయ్యాయి. శుక్రవారం పురుషుల జట్టు పూర్తి ఆధిపత్యంతో స్వర్ణం నెగ్గగా.. రెజ్లింగ్‌లో మూడు మెడల్స్.. సెపక్‌తక్రాలో చారిత్రక కాంస్యం మన ఖాతాలో చేరాయి.

హాంగ్జౌ: ఐదేండ్ల క్రితం జకార్తాలో జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ 70 పతకాలు సాధించగా.. ఈ సారి వంద మెడల్స్ సాధించాలనే లక్ష్యంతో హాంగ్జౌ చేరిన భారత్.. ఇప్పుడా సంఖ్యను దాటి ముందుకు సాగుతోంది. ఇప్పటికే 95 మెడల్స్ (22 స్వర్ణాలు, 34 రజతాలు, 39 కాంస్యాలు) ఖాతాలో వేసుకున్న భారత్.. కబడ్డీ (2), ఆర్చరీ (3), హాకీ (1), బ్యాడ్మింటన్ (1), క్రికెట్ (1)లో పతకాలు ఖాయం చేసుకుంది. శనివారం మనవాళ్లు సెంచరీ మార్క్ దాటడం ఖాయమే. రెజ్లర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే.. భారత్ ఖాతాలో మరిన్న పతకాలు చేరే అవకాశం కూడా ఉంది. ఇక శుక్రవారం పోటీల్లో అనధికారిక జాతీయ క్రీడ హాకీలో పురుషుల జట్టు దుమ్ము రేపింది. ఫైనల్లో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యం లోని భారత్ 5-1తో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌ను మట్టికరిపించింది. హర్మన్‌ప్రీత్ (32వ, 59వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో

ఓవరాల్‌గా 95 పతకాలు

మెరిస్తే.. అమిత్ రొహిదాస్ (36వ ని.), మన్‌ప్రీత్ సింగ్ (25వ ని.), అభిషేక్ (48వ ని.) ఒక్కో గోల్ చేశారు. జపాన్‌పై ఏకపక్ష విజయంతో పసిడి పతకంతో పాటు భారత జట్టు వచ్చే ఏడాది పారిస్ వేదికగా జరుగనున్న ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించింది.

బ్రిడ్జ్‌లో రజతం.. ప్రణయ్‌కు కాంస్యం

బ్రిడ్జ్ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు రజతం కైవసం చేసుకుంది. మరోవైపు పురుషుల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో 41 ఏండ్ల తర్వాత భారత షట్లర్‌కు ఆసియా క్రీడల్లో పతకం దక్కింది. హెచ్‌ఎస్ ప్రణయ్ కంచు మోత మోగించాడు. మరోవైపు పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట ఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించింది. కబడ్డీలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్‌కు చేరాయి. సెపక్‌తక్రాలో భారత్‌కు చారిత్రక కాంస్యం లభించింది. ఆర్చరీలో రికర్వ్ టీమ్ విభాగాల్లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. రెజ్లింగ్‌లో అమన్ షెరావత్ కాంస్యం గెలుచుకున్నాడు.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	187	104	63	354
2	జపాన్	47	57	65	169
3	కొరియా	36	49	84	169
4	భారత్	22	34	39	95
5	ఉజ్బెకిస్థాన్	20	18	26	64

నోట్: దే-దేశం, స్వ-స్వర్ణం, ర- రజతం, కా-కాంస్యం, మొ-మొత్తం

మిస్టర్ ఇండియా టైటిల్ నెగ్గిన హైదరాబాదీ జాసన్ డైలాన్ బ్రెట్టీలియాన్‌ను శుక్రవారం క్రీడా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్‌లో అభినందించారు. మిస్టర్ గ్లోబల్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం అందిస్తామని వెల్లడించారు

గిల్‌కు డెంగ్యూ

చెన్నై: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ ప్రారంభానికి ముందు భారత్‌కు చేదువార్త. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా దంచికొడుతూ.. ఫుల్ ఫామ్‌లో ఉన్న టీమ్‌ఇండియా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్.. వరల్డ్‌కప్ తొలి మ్యాచ్‌లో ఆడేది అనుమానంగా కనిపిస్తున్నది. మెగాటోర్నీలో భాగంగా ఆదివారం ఆస్ట్రేలియాతో రోహిత్‌సేన అమీతుమీ తేల్చుకోనుండగా.. ప్రస్తుతం గిల్ డెంగ్యూతో బాధ పడుతున్నట్లు భారత హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్ వెల్లడించాడు. అయితే మ్యాచ్ ప్రారంభానికి ఇంకా సమయం ఉండటంతో ఇప్పుడే నిర్ణయం తీసుకోలేమని వెల్లడించాడు.

ఉప్పల్‌లో తొలి ప్రపంచకప్ మ్యాచ్

పాక్ బోణీ

నెదర్లాండ్స్‌పై ఘన విజయం

రాణించిన రిజ్వాన్, షకీల్

హైదరాబాద్ వేదికగా జరిగిన ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్ టోర్నీలో పాకిస్థాన్ అదిరిపోయే బోణీ కొట్టింది. ఉప్పల్ స్టేడియంలో ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో పసికూన నెదర్లాండ్స్‌పై పాక్ ఘన విజయం సాధించింది. తొలుత రిజ్వాన్, సౌద్ షకీల్ అర్ధసెంచరీలతో పోరాడే స్కోరు అందుకున్న పాక్.. ఆ తర్వాత డచ్ పని పట్టింది. రవూఫ్, అలీ నిప్పులు చెరిగే పేస్‌తో డచ్ బ్యాటింగ్ పతనాన్ని శాసించారు. విక్రమ్‌జీత్‌సింగ్, డీ లీడే పోరాడినా.. సహచరుల నుంచి సరైన సహకారం లేకపోవడంతో సాధ్యం కాలేదు. మొత్తంగా ఉప్పల్ స్టేడియంలో తొలిసారి జరిగిన ప్రపంచకప్ మ్యాచ్ అభిమానులను అలరించింది.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ శుభారంభం చేసింది. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో పాక్ 81 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత మహమ్మద్ రిజ్వాన్ (75 బంతుల్లో 68, 8ఫోర్లు), సౌద్ షకీల్ (52 బంతుల్లో 68, 9ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనా వీరిద్దరు కలిసి సాధికారిక ఇన్నింగ్స్‌తో జట్టుకు పోరాడే స్కోరు కట్టబెట్టారు. బాస్ డీ లీడే (4/62), అకర్‌మన్ (2/39) రాణించారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన డచ్ జట్టు 41 ఓవర్లలో 205 పరుగులకు కుప్పకూలింది. విక్రమ్‌జీత్‌సింగ్ (67 బంతుల్లో 52, 4ఫోర్లు, సిక్స్), డీ లీడే (68 బంతుల్లో 67, 6ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. హరిస్ రవూఫ్ (3/43), హసన్ అలీ (2/33) రాణించారు. షకీల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

స్టేడియం హాజరు 8991

ఉప్పల్ స్టేడియం వేదికగా పాక్, నెదర్లాండ్స్ మ్యాచ్‌కు 8991 మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

27 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌లో

సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్.. ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ టోర్నీకి వేదికైంది. సరిగ్గా 27 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌లో ప్రపంచకప్ మ్యాచ్ జరిగింది. శుక్రవారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో పాకిస్థాన్, నెదర్లాండ్స్ జట్ల మధ్య తొలి మ్యాచ్ జరిగింది. చివరిసారిగా నగరం నడిబొడ్డున ఉన్న ఎల్బీ స్టేడియంలో జింబాబ్వే, వెస్టిండీస్ మధ్య ఫిబ్రవరి 16, 1996లో వరల్డ్‌కప్ మ్యాచ్ జరిగింది. ఇందులో వెస్టిండీస్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అయితే 2011, 2016లో మెగాటోర్నీకి భారత్ ఆతిథ్యమిచ్చినప్పటికీ హైదరాబాద్ ఆతిథ్య హోదా దక్కించుకోలేకపోయింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం జరుగుతున్న మెగాటోర్నీ కోసం రాచకొండ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 1500 మంది పోలీసులను మ్యాచ్ కోసం మోహరించారు.

మోదీ స్టేడియంలోనూ మరకలే

అహ్మదాబాద్: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్‌లో వేదికల సౌకర్యాల విషయంలో లోపాలు బయటపడుతూనే ఉన్నాయి. పుష్కర కాలం తర్వాత తొలిసారి వరల్డ్‌కప్‌నకు పూర్తిస్థాయిలో ఆతిథ్యమిస్తున్న బీసీసీఐ.. ఏర్పాట్ల విషయంలో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద స్టేడియంగా (సామర్థ్యం పరంగా) పేరొందిన అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో స్టాండ్లలో నెలకొన్న పరిస్థితులు తాజాగా వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో సౌకర్యాల వైఫల్యం మరువక ముందే మోదీ స్టేడియంలో అపరిశుభ్ర పరిస్థితులపై అభిమానులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఇప్పటికే ఇంగ్లండ్, న్యూజిలాండ్ తొలి మ్యాచ్‌కు ప్రేక్షకులు కరువై తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న బీసీసీఐపై మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా ఇప్పుడు ఫ్యాన్స్.. సోషల్‌మీడియాలో బోర్డును ఆడుకుంటున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తనయుడు జైషా ఆధ్వర్యంలో జరుగుతున్న మెగాటోర్నీలో ఆదిలోనే విమర్శలు రావడం ఒక రకంగా బీసీసీఐ ప్రతిష్టను మసకబారుస్తున్నదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య గురువారం జరిగిన తొలి మ్యాచ్ సందర్భంగా మోదీ స్టేడియంలో సీట్లు అపరిశుభ్రంగా ఉండటం తాజాగా వెలుగులోకి వచ్చింది. కనీసం కూర్చుకునేందుకు వీలు లేకుండా స్టేడియంలోని కుర్చీలు ఏర్పాటు చేయడంపై ఫ్యాన్స్ సోషల్‌మీడియాలో తెగ ట్రోల్ చేస్తున్నారు.

ఫ్యాన్స్ ట్రోలింగ్

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 49 ఓవర్లలో 286 ఆలౌట్ (రిజ్వాన్ 68, షకీల్ 68, డీ లీడే 4/62, అకెర్‌మన్ 2/39), **నెదర్లాండ్స్:** 41 ఓవర్లలో 205(విక్రమ్‌జీత్‌సింగ్ 52, డీ లీడే 67, రవూఫ్ 3/43, అలీ 2/33)

రసవత్తర రాజకీయం

కాంగ్రెస్‌కు అధికారం పగటి కల

- **క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి బలం లేదు**
- **ఢిల్లీ అధిష్ఠానం వయా బెంగళూరు**
- **తెలంగాణ ప్రగతి కొనసాగింపు కేసీఆర్‌కే సాధ్యం**
- **మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే**
- **శాసనమండలి చైర్మన్ గుత్తా**

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తాము అధికారంలోకి వస్తామంటూ కాంగ్రెస్ నేతలు పగటి కలలు కంటున్నారని, ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో బలం లేదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ గాలి వీస్తున్నదనేది కేవలం ప్రచారమేనని కొట్టిపారేశారు. రాష్ట్రంలో కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న పథకాలు కొనసాగాలన్నా, అన్‌గోయింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి కావాలన్నా కేసీఆర్ మూడోసారి సీఎం కావాల్సిందేనని, వేరే వారికి వాటిని పూర్తి చేయడం సాధ్యం కాదని చెప్పారు. గతంలో కాంగ్రెస్ హైకమాండ్‌ను కలవాలంటే హైదరాబాద్ టు ఢిల్లీ ఉండేదని, ఇప్పుడు హైదరాబాద్ టు ఢిల్లీ వయా బెంగళూరుగా మారిందని ఎద్దేవా చేశారు.

నల్లగొండ 12 స్థానాలు బీఆర్ఎస్‌వే

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12కి 12 స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తుందని గుత్తా సుఖేందర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు. పొద్దున ఒకలా, సాయంత్రం ఒకలా, రాత్రి 10 తర్వాత ఒకలా మాట్లాడే ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాటలు పట్టించుకుంటే టైంవేస్ట్ అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను ఢీకొనగల నాయకుడు ఏ పార్టీలోనూ లేడని పేర్కొన్నారు.

మోదీది నియంత పాలన

ప్రధానమంత్రి హోదాలో ఉన్న మోదీ ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి కుటుంబంపై పనిగట్టుకొని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. కుటుంబ రాజకీయాల గురించి బీజేపీ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి లోనై మోదీ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర క్యాబినెట్‌లో అవినీతిపరులు లేరా? బీజేపీలో చేరితే అవినీతి పరులందరూ పవిత్రులైపోతారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి సింగిల్‌డిజిట్ దాటదని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా బీజేపీకి ఎన్నికల్లో పెద్దగా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు.

కేంద్రం చెప్పినట్టే గవర్నర్ కార్యాచరణ సరికాదు

గవర్నర్ వ్యవస్థ పూర్తిగా రాజకీయ అవసరాలు తీర్చే వేదికగా మారిందని గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక కోణాలను పరిశీలించి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ప్రతిపాదిస్తుందని, రాజకీయ నాయకులు ఉన్నారని వాటిని తిరస్కరించడం సరికాదని స్పష్టంచేశారు. కులగణన ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చేసుకునే విధంగా చట్టాన్ని మార్చాలని కోరారు.

చంద్రబాబు అరెస్టు బాధాకరం

సుదీర్ఘకాలం రాజకీయాలు చేసిన నాయకుడు, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టు బాధాకరణమని గుత్తా సుఖేందర్ పేర్కొన్నారు.

రేవంత్ మూలం బీజేపీయే

- **ఆయన అనుబంధమంతా ఆరెస్సెస్, ఏబీవీపీతోనే**
- **రేవంత్.. నీ సినిమా మొత్తం మా దగ్గర ఉన్నది**
- **ఆర్ఎస్ఎస్‌తో సంబంధం లేదని ప్రమాణం చేస్తావా?**
- **కాంగ్రెస్ నేతలపై అసదుద్దీన్ ఒవైసీ మండిపాటు**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జీవితమంతా బీజేపీ దాని మాతృ సంస్థ ఆరెస్సెస్‌తోనే ముడిపడి ఉన్నదని ఎంఐఎం అధినేత సదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆయన దశాబ్దాల నుంచి హైదరాబాద్‌లో ప్రస్తుత బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు కిషన్‌రెడ్డితోనే కలిసి తిరిగారని తెలిపారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన ఓ సమావేశంలో మాట్లాడారు. 'ఆసదుద్దీన్ ఒవైసీ కుటుంబం మహారాష్ట్ర నుంచి వచ్చింది అంటున్నావ్.. నా తాత ముత్తాతలు హిందుస్తాన్‌లోనే పుట్టారు. నా పూర్వీకులు ఇక్కడ పుడితే నా దేశం ఇదే అనే హక్కు లేదా? నువ్వు ఎక్కడి నుంచి వచ్చావ్ రాహుల్‌గాంధీ? తెలంగాణ కాంగ్రెస్ నేతల మాటలు వాళ్ల సొంత మాటలు కాదు.. అవి ఆరెస్సెస్ నాలుక నుంచి వచ్చిన మాటలు. రేవంత్‌రెడ్డి 1999 అసెంబ్లీ ఎన్నికల్లో కిషన్‌రెడ్డితో కలిసి పనిచేయడం నేను చూశాను. గుడిమల్కాపూర్ మార్కెట్ ఆ టైంలో కార్వాన్ మార్కెట్‌గా ఉండేది. అక్కడ రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డితో కలిసి పనిచేశారు. గుర్తు పెట్టుకో రేవంత్.. నీ సినిమా మొత్తం మా దగ్గర ఉన్నది. నువ్వు ముందు ఏబీవీపీలో ఉండి, అటునుంచి ఆరెస్సెస్‌లోకి వెళ్లావు. అక్కడి నుంచి బీజేపీకి వెళ్లావు. ఆరెస్సెస్‌వాళ్లు చంద్రుడి (చంద్రబాబు) దగ్గరికి వెళ్లమంటే, బీజేపీ నుంచి ఆయన దగ్గరికి వెళ్లావు. చంద్రుడి పని అయిపోగానే కాంగ్రెస్‌లోకి వెళ్లావు. కాంగ్రెస్ ఇలాంటి ఆరెస్సెస్‌వాళ్లను కలుపుకొంటున్నది' అని మండిపడ్డారు.

ప్రమాణం చేస్తావా రేవంత్?

ఆరెస్సెస్‌తో సంబంధం లేదని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేస్తావా రేవంత్‌రెడ్డి? అని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ సవాల్ విసిరారు. నగరంలోని బండ్లగూడలో సాలార్ ఏ మిల్లిత్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన ఫాతిమా ఒవైసీ కేజీ టు పీజీ క్యాంపస్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధినాయకులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీతో పాటు తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఎక్కడ పుట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. తాము హిందు, సిక్కు, క్రైస్తవులకు వ్యతిరేకం కాదని, అన్ని మతాలవారికి దారుసలాం దర్వాజాలు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు.

స్పీకర్‌కు పద్మశాలీల మద్దతు

కోటగిరి, అక్టోబర్ 6 : బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా గ్రామాల్లో రోజురోజుకూ తీర్మానాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండల కేంద్రానికి చెందిన పద్మశాలీ కులస్థులు బీఆర్ఎస్ పార్టీకి, బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి పోచారం శ్రీనివాసరెడ్డికి పూర్తి మద్దతు తెలిపారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి శుక్రవారం బాన్సువాడలో స్పీకర్‌కు అందజేశారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని వారు స్పష్టం చేశారు.

అంతర్జాతీయ స్థాయికి నెహ్రూ జూపార్క్

- **డైమండ్ జూబ్లీ వేడుకల్లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**

ఈ-సైకిల్‌ను ప్రారంభించి సైకిల్‌పై రైడ్ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్/చార్మినార్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్కును సీఎం కేసీఆర్ సహకారంతో అంతర్జాతీయ స్థాయి జంతు ప్రదర్శనశాలగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్టు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. నెహ్రూ జూపార్క్ 60 వసంతాలను పూర్తిచేసుకోవడంతో శుక్రవారం నిర్వహించిన శుక్రవారం నిర్వహించిన వజ్రోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపార్క్ ఎంట్రీ వద్ద ఏర్పాటు చేసిన వజ్రోత్సవాల లోగో, డైమండ్ జూబ్లీ ఫైలాన్, సెంట్రల్ ఫౌంటెయిన్‌ను ఆవిష్కరించడంతో పాటు ఇంటిగ్రేటెడ్ ఆన్‌లైన్ టికెట్ సేవలను ప్రారంభించారు. సందర్శకుల వీక్షణ కోసం 30 ఏండ్ల తర్వాత మళ్లీ 2 కపుచిన్ జాతి కోతులను, 2 తెల్ల పులులను జూలో ప్రవేశపెట్టడంతోపాటు ఈ-సైకిల్, ఎలక్ట్రిక్ రోడ్‌రైలు సేవలను ప్రారంభించారు. ఆ రెండు తెల్ల పులులకు శివపార్వతులుగా నామకరణం చేసి, ఈ-సైకిల్‌పై షికారు చేశారు. డైమండ్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉత్తమ సేవలు అందిస్తున్న జూపార్క్ సిబ్బందిని, జూ నిర్వహణకు చేయూతనిస్తున్న సంస్థల ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో బహదూర్‌పుర ఎమ్మెల్యే మౌజంఖాన్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ తదితరులు పాల్గొన్నారు.

బాబుకు బెయిల్‌పై సోమవారం తీర్పు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయడమా లేక పోలీసు కస్టడీకి అప్పగించడమా అన్నదానిపై ఏసీబీ కోర్టు సోమవారం నిర్ణయించనుంది. చంద్రబాబుకు బెయిల్, కస్టడీ పిటిషన్లపై మూడురోజులపాటు సాగిన వాదనలు శుక్రవారం ముగిశాయి. అనంతరం తీర్పును రిజర్వు చేస్తున్నామని, సోమవారం నిర్ణయాన్ని వెల్లడిస్తామని న్యాయమూర్తి తెలిపారు. బాబు తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రమోద్ కుమార్ దూబె, సీఐడీ తరపున ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. బాబును మరో మూడు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని, సెంట్రల్ జైలులోనే ఆయనను ప్రశ్నిస్తామని సీఐడీ కోరుతున్నది.

ఐఏఎస్‌లకు జీతాలు చెల్లించని ఏపీ సర్కారు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని ఐఏఎస్ అధికారులకు సెప్టెంబర్ నెల వేతనం ఇప్పటి వరకు అందలేదు. ఈ నెల 5వ తేదీ దాటినా సర్కారు జీతాలు ఇవ్వలేదు. దీంతో ఐఏఎస్‌లు గుర్రుగా ఉన్నారు. గడిచిన కొన్ని నెలల్లో ఐఏఎస్‌లకు రాష్ట్రప్రభుత్వం 20వ తేదీ వరకూ వేతనాలు చెల్లించని పరిస్థితి నెలకొన్నదని ఐఏఎస్ అధికారులు పేర్కొంటున్నారు. కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి చెల్లించాల్సిన వేతనాలు ఏపీలో నిలిపి వేయడంపై ఐఏఎస్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని మండిపడుతున్నారు. ఈ విషయమై ఐఏఎస్ అధికారులు కేంద్రానికి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఐఏఎస్ అధికారులతో పాటు చాలా విభాగాల ఉద్యోగులు, టీచర్లకూ సెప్టెంబర్ నెల వేతనాలు ఇంకా అందలేదు.

పద్మావతి ఉత్తమ్‌కు టికెట్ ఇవ్వొద్దు!

కోదాడ, అక్టోబర్ 6: కార్యకర్తలకు అండుబాటులో ఉండని మాజీ ఎమ్మెల్యే పద్మావతిఉత్తమ్‌కు ఈసారి టికెట్ ఇవ్వొద్దంటూ కోదాడ నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ కార్యకర్తలు శుక్రవారం గాంధీభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన దాదాపు 300 మంది కార్యకర్తలు ప్లకార్డులతో ధర్నా చేపట్టారు. మాజీ ఎంపీటీసీ వెంకన్న నారాయణ, ప్రభాకర్, గోపి, వెంకటేశ్వర్లు, జయంత్, అశోక్, బాబా నేతృత్వంలో ఆందోళన సాగింది. కోదాడ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పద్మావతిఉత్తమ్ తోపాటు మరో నలుగురు అధిష్ఠానానికి దరఖాస్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పద్మావతి ఓటమి పాలైనప్పటి నుంచి కార్యకర్తల బాగోగులు పట్టించుకోలేదని, ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని నియోజకవర్గంలో తిరగడం సరికాదని పేర్కొన్నారు.

కుక్కర్లు పంచిన కాంగ్రెస్

- **ఆదిలాబాద్‌లో తొక్కిసలాట, భారీగా ట్రాఫిక్ జామ్**
- **కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి అరెస్ట్**

ఆదిలాబాద్ రూరల్, అక్టోబర్ 6: ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద శుక్రవారం సాయంత్రం స్థానిక కాంగ్రెస్ నాయకుడు, కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి చేపట్టిన కుక్కర్ల పంపిణీ రసాభాసగా మారింది. కుక్కర్లు తీసుకోవడానికి జనం పెద్ద సంఖ్యలో తరలి రాగా, గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేయగా, కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆయన అనుచరులు అడ్డుకున్నారు. పోలీసులు రాకపోకలను పునరుద్ధరించి కుక్కర్ల ఉన్న వాహనాలను సీజ్ చేశారు. కుక్కర్ల పంపిణీని అడ్డుకున్నారని కంది శ్రీనివాస్‌రెడ్డి తన అనుచరులతో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగగా, పోలీసులు అరెస్ట్ చేసి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

మా ఓటు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కే

హన్వాడ, అక్టోబర్ 6 : రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కే ఓటు వేస్తామని బుద్ధారం ప్రజలు ప్రకటించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని బుద్ధారం గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన బ్యాసర్‌పై స్థానికులు సంతకాలు చేశారు. తమ ఓటు శ్రీనివాస్‌గౌడ్‌కే అంటూ తీర్మానం చేశారు. దాదాపుగా 500 మందికిపైగా సంతకాలు చేశారు.

రేవంత్ చరిత్ర తెలుసుకో!

- **తెలంగాణను నాశనం చేసిందే కాంగ్రెస్**
- **రెడ్‌కో చైర్మన్ వైసతీశ్‌రెడ్డి ధ్వజం**

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): అలీబాబా.. అరడజను దొంగల్లాగా.. రాహుల్ బాబా.. మూడు డజన్ల దొంగల కమిటీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అని రెడ్‌కో చైర్మన్ వై. సతీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్కాములకు కేరాఫ్ కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? అని రేవంత